క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, మాజీ వైస్ ఎంపీపీ బాషబోయిన పద్మాపాపయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బాషబోయిన సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనువాస్, నాయకులు కూర్ల రమేష్, డాక్టర్ సూదగాని లక్ష్మయ్య, బెజ్జంకి భిక్షం, ఉప్పల నరసింహ, నార్కట్‌పల్లి సహదేవ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

మోటకొండూర్ : మండల కేంద్రంలో శ్రీ నేత్రాలయ కంటి ఆస్పత్రి , లేజర్ సెంటర్ వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగయ్య గౌడ్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుణి రఘునాథరాజు, పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య, కొల్లూరి యాదగిరి, కంకల ఎలేందర్, బాల్ద సిద్దులు, వంగాల మల్లేష్ గౌడ్, కొరటికంటి భాస్కర్, జూకంటి మధు, బుగ్గ మహేష్, బాల సిద్దులు, భూమండ్ల ఐలయ్య, రేగు యాదరిగిరి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని మాధవనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. అధ్యక్షుడిగా గంజి చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా మూషం గోవర్ధన్, ప్రధానకార్యదర్శిగా బింగి సత్తయ్య, కోశాధికారిగా రావిరాల గణేశ్, సహాయకార్యదర్శిగా కాసా కోటయ్య, సభ్యులుగా ఎలగందుల రా మరుషి, సిద్దుల రామ్మూర్తి, పొన్న నర్సింహ, సూరెపల్లి కుమర్, మూషం అంబదాస్, అందె నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని కాలనీవాసులు ఘనంగా సన్మానించారు.

ఫలహారం బండి ఊరేగింపు

యాదగిరిగుట్ట: పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో ఆదివారం ఫలహారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ ఆవుల మమత సాయి, భిక్షపతి, వంగపల్లి అరుణ్, గుండ్లపల్లి భరత్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా వంట సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 తేదీలోపు దరఖాస్తులను కేజీబీవీ ప్రత్యేకాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

శత రుద్ర శివలింగ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోగల రమణేశ్వరంలోని శివశక్తి షిర్డి సాయి అనుగ్రహ మహాపీఠంలో ఆదివారం శత రుద్ర శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నర్వహించారు. . ఈ సందర్భంగా సిద్ధగురు రమణానంద మహర్షి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని విమర్శించడం తగదు

సంసాన్ నారాయణపురం: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించడం తగదని ఆయనకు ఆ అర్హత లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరెంటోత్ శ్రీనునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గానికి ఆయన చేసింది ఏమి లేదని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు మందుగుల బాలకృష్ణ, కరెంటోత్ భిక్షపతినాయక్, ఉప్పల లింగస్వామి, ఏపూరి సతీష్, నోముల మాధవరెడ్డి, బుజ్జి, జైపాల్ రెడ్డి, రామచంద్రం, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనునాయక్

నిరుపయోగంగా నిఘా నేత్రాలు

- గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు
- నిర్వహణ లేక పనిచేయని వైనం
- మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని డిమాండ్



రామాజీపేటలో పనిచేయని సీసీ కెమెరాలు



వంగపల్లిలో..

యాదగిరిగుట్ట రూరల్ : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయి.. సీసీ కెమెరాల ఏర్పాటు అందరి బాధ్యత అంటూ ప్రజలను, వ్యాపారులను పోలీస్‌శాఖ చైతన్యపరుస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో పట్టణంతో పాటు పల్లెల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తుంది. అయితే లక్షల రూపాయల వ్యయంతో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా వాటి నిర్వహణ లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారుతున్నాయి. గతంలో పలువురు దాతల సహకారంతో యాదగిరిగుట్ట మండలంలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా కొన్ని రోజులు సీసీ కెమెరాలు పనిచేశాయి. కానీ వాటి పర్యవేక్షణ లేకపోవడం, గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన రావడంతో సీసీ కెమెరాలను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో పల్లెల్లో సీసీ కెమెరాల వ్యవస్థ పూ ర్తిగా మూలన పడింది.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం అన్న సూక్తిని పలు సందర్భాల్లో పోలీసు అధికారులు చెప్పినా ఆచరణ లో సరైన పర్యవేక్షణ లేక పోవడంతో నిఘా వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

270 సీసీ కెమెరాలు ఏర్పాటు..

యాదగిరిగుట్ట మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మహబూబ్‌పేట, మాసాయిపేట, వంగపల్లి, మల్లాపురం, సైదాపురం, బాహుపేట, పెద్దకందుకూరు, చిన్నకందుకూరు, కాచారం, దాతర్‌పల్లి, రాళ్లజనగాం, రామాజీపేట గ్రామాల్లో దాతల సహకారంతో గతంలో మొత్తం 270 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం 180 సీసీ కెమెరాలు పని చేయడం లేదు.

కోతుల బెడదతో..

మండలంలోని ఆయా గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. దీంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను కోతులు పీకి పడేస్తున్నాయి. స్తంభాలకు ఉన్న కెమెరాలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో సీసీ కెమెరాల వైర్ల వ్యవస్థ సక్రమంగా లేకుండా పోయి కెమెరాలు పని చేయడం లేదు. ఎంతో సదుద్దేశంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ని ఘా వ్యవస్థ మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, నిరుపయోగంగా ఉన్న కెమెరాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



మా గ్రామంలో గతంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వీటి నిర్వహణ గాలికి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– గాజుల శ్రీకాంత్, మహబూబ్‌పేట

మరమ్మతులు చేయించాలి



గ్రామంలో దాతల సహకరంతో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిచాం. కొన్ని రోజుల తర్వాత కోతులు, సీసీ కెమరాల వైర్లను కొరికి పడేశాయి. కోతులను అదుపులో ఉంచడానికి గ్రామంలో కొండంగిని కూడా తీసుకుని వచ్చాం. సర్పంచ్‌ల పాలన ముగిశాక సీసీ కెమెరాల నిర్వహణ కరువైంది. దాతల సహకారంతో పాడై పోయిన సీసీ కెమరాలను మరల మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

– మొగిలిపాక తిరుమల, మాజీ సర్పంచ్, రామాజీపేట

ప్రజలు సహకరించాలి



కేసుల పరిష్కారానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయి. నేరాలను అదుపులో ఉంచడానికి, నేరస్తులను పట్టుకోవడానికి ముఖ్య పాత్ర పోషిస్తాయి. మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు,దాతలు సీసీ కెమెరాల నిర్వహణకు, రక్షణకు సహకరించాలి

– భాస్కర్, ఎస్‌హెచ్‌ఓ, యాదగిరిగుట్ట

హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయిస్తా : ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి : జూలూరు – రుద్రవెల్లి గ్రామాల మధ్య మూసీపై అసంపూర్తిగా ఉన్న హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయిస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జూలూరు వద్ద వరద ఉధృతి వల్ల దెబ్బతిన్న లోలెవల్ బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరు – రుద్రవెల్లి గ్రామాల మధ్య మూసీపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్నందున ప్రస్తుత కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేసి, నూతన కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణానికి మరికొన్ని నిధులు మంజూరు చేయించి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వరదతాకిడికి దెబ్బతిన్న లోలెవల్ బ్రిడ్జి పై గుంతలను మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.



లో లెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వర్షాలతో ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అధికారులంతా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కాసుల అంజయ్య, దాసరి నర్సింహ, పాంకుంట్ల దయాకర్, అశోక్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం

భూదాన్‌పోచంపల్లి : మండలం కేంద్రంలోని నల్లపోచమ్మ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తడక వెంకటేశం , సామ మధుసూదన్‌రెడ్డి, భారత లవకుమార్, అ తడక రమేశ్, రాజేంద్రప్రసాద్, సామ మోహన్‌రెడ్డి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, సుర్వి వెంకటేశ్, శ్రీను, శ్రీనివాస్, కట్కూరి పాండురంగం, కొయ్యడ నర్సింహ, గునిగంటి మల్లేశ్, తండ వెంకటేశ్, సాహేశ్, చంద్రశేఖర్, రాజారమేశ్, బొడిగె లింగంగౌడ్ రామకృష్ణ, బొడిగె బాబు, శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పూజలు చేశారు. ఆయనవెంట మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు చింతకింది కిరణ్, సీత శ్రవన్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం – జనగాం మధ్యలో గల వాగుపై వంతెన ని ర్మించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వాగు వద్ద ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నరేష్, ఐత రాజు కిరణ్, వంశీ, సైదులు, రవి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలి

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల – సదర్శాపురం గ్రామాల మధ్య గల బృందావన్ కాల్వపై కల్వర్టు నిర్మించాలని ఆదివారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటనర్సు, చంద్రయ్య, యాదయ్య, సోమయ్య, సాంబయ్య, రంగారెడ్డి, చంద్రయ్య, వెంకన్న, యాదయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆలేరును అగ్రగామిగా నిలుపుతా



యాదగిరిగుట్ట : సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ఆలేరురూరల్ : సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: అభివృద్ధిలో ఆలేరు నియోజకవర్గాన్ని అగ్రగా మిగా నిలుపుతానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో ని తెలంగాణ చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎ న్నికలప్పుడే రాజకీయాలని..ఆ తరువాత అభివృద్ధిపైనే దృష్టి ఉండాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే రోడ్డు పనులు రెండు నెలల్లో పూర్తి చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం టాంగాపై ఎక్కి పట్టణంలో పర్యటించారు. కార్యక్రమంలో ఎస్సీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, మండల, పట్టణ అధ్యక్షులు మంగ సత్యనారాయణ, బందారపు భిక్షపతి, మాజీ కౌన్సిలర్లు బబ్బూరి మౌనిక శ్రీధర్, దండబోయిన అనిల్, బూడిద సురేందర్, గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశం, గౌళికార్ అరుణ రాజేష్, మాజీ ఎంపీటీసీలు సాధూనేని మధుకర్, సీస కృష్ణ, లకుంట్ల బాల్‌నర్సయ్య, జోగయ్య, పెలిమెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

వడ్డెర్ల అభ్యున్నతికి కృషి చేస్తా

యాదగిరిగుట్ట : వడ్డెర కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనను కలిశారు. సెప్టెంబర్ 19న యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు, జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిట్ల మల్లేష్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు శివరాత్రి దానయ్య, ఉపాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, గుర్రం శ్రీనివాస్, మాగని రాజు, వెంకటయ్య, సురేష్, మహేష్, సంతోష్, భానుచందర్, యూత్ అధ్యక్షులు పల్లపు నగేష్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సర్వాయి పాపన్న

ఆలేరురూరల్ : ఆదర్శనీయుడు సర్వాయి పాపన్న అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గొలనుకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బహుజనులు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, దూపటి వెంకటేష్, ఆరె ప్రశాంత్, కొండ్రాజు వెంకటేశ్వరారాజు, ఊట్కూరి సురేష్, జహంగీర్, విక్రమ్, ఆంజనేయులు, చీర శ్రీశైలం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం బోనాల వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ, మారమ్మ, పోచమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనగిరి : బోనాలతో వెళ్తున్న మహిళలు



మోత్కూరు : బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



రాజాపేటలో..



ఆలేరురూరల్ : మంతపురిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



భూదాన్‌పోచంపల్లి : దోతిగూడెంలో..



ఆత్మకూరు(ఎం) : రహీంఖాన్‌పేటలో..



బొమ్మలరామారం : ఫక్కీరు గూడెంలో..



చౌటుప్పల్‌లో..



రామన్నపేటలో బోనాలు తీసుకుని వెళ్తున్న మహిళలు



సంస్థాన్ నారాయణపురం : వావిళ్లపల్లిలో..



వలిగొండలో..

రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం): ఈ నెల 18,19 తేదీల్లో మోత్కూరులో నిర్వహించనున్న సీపీఎం ప్రాంతీయ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. సీపీఎం ప్రాంతీయ రాజకీయ శిక్షణా తరగతుల్లో మోత్కూరు, అడ్డగూడూరు. గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, సామ శ్రీనువాసరెడ్డి, ముత్యాలు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని జీబీఆర్ గార్డెన్స్‌లో పోచంపల్లి, బీబీనగర్ మండలాల సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ తరగతుల్లో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

అడ్డగూడూరు: మండల కేంద్రంలోని మానాయికుంట – గట్టుసింగారం రోడ్డు వెంట ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్న తీరుపై ఈనెల 10 న అల్లుకున్న నిర్లక్ష్యం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆదివారం విద్యుత్ స్తంభానికి అల్లుకుని ఉన్న చెట్ల తీగలను తొలగించారు.

జట్కా బండి నడిపిన ఎమ్మెల్యే ఐలయ్య



జట్కా బండి నడుపుతున్న ఎమ్మెల్యే ఐలయ్య

యాదగిరిగుట్ట : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చే శారు. ఈ సందర్భంగా జట్కా బండి స్వయంగా నడుపుకుంటూ పట్టణంలోని పాలు ప్రాంతాల్లో తిరిగి ఆకట్టుకున్నారు. అలాగే స్వయంగా జేసీబీ నడిపించి పనులు ప్రారంభించారు.

ప్రముఖ వైద్యుడు రాంప్రసాద్ హఠాన్మరణం

- శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి
- 35 ఏళ్లుగా వైద్య వృత్తిలో..
- తన హస్తవాసితో వందల కుటుంబాల్లో వెలుగులు
- తాత, తండ్రి, కుమారుడు, కుమార్తె కూడా వైద్యులే

చౌటుప్పల్ : ప్రముఖ వైద్యుడిగా పేరుగాంచిన డాక్టర్ సికిలంమెట్ల రాంప్రసాద్ ఇక లేరు. శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. రాంప్రసాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించి 1990లో చౌటుప్పల్‌లోని చిన్నకొండూర్ రోడ్డులో ఓ చిన్న అద్దె ఇంటిలో ఆస్పత్రి ప్రారంభించాడు. 1997లో స్థానిక విద్యానగర్‌కాలనీలో సొంత భవనంలోకి ఆస్పత్రి మార్చాడు. చౌటుప్పల్ పట్టణంతో పాటు పరిసర మండలాల ప్రజానీకానికి 35 ఏళ్లుగా వైద్య సేవలందించారు.

కుటుంబంలో మూడు తరాల వైద్యులు..

చౌటుప్పల్ మండల పరిధిలోని పీపల్‌పహాడ్‌కు చెందిన సికిలంమెట్ల దానయ్య–గౌరమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. రాంప్రసాద్ కుటుంబమంతా వైద్యులుగానే ఈ ప్రాంతానికి సుపరిచితులు. తన తాత సికిలంమెట్ల గోపాలం, తండ్రి దానయ్య ఆయుర్వేద వైద్యులుగా సేవలందించారు. రాంప్రసాద్ కుమారుడు జయంత్, కుమార్తె స్నేహ ఎంబీబీఎస్ పూర్తిచేసి ప్రస్తుతం వైద్యులుగా స్థిరపడ్డారు. కుమారుడు జయంత్ చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తుండగా కుమార్తె స్నేహ ప్రస్తుతం తండ్రి వద్దనే ఉంటూ వైద్యురాలిగా సేవలందిస్తున్నారు.



రాంప్రసాద్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, నాయకులు, ప్రముఖులు

ప్రభుత్వ వైద్యుడిగా..



డాక్టర్ రాంప్రసాద్ (ఫైల్)

రాంప్రసాద్ ప్రభుత్వ వైద్యుడిగా రెండు దశాబ్దాలకుపైగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో, ఆ తర్వాత సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, యాదాద్రి జిల్లాలోని వలిగొండ, వేములకొండలో పీహెచ్‌సీ వైద్యుడిగా పని చేశారు. అనంతరం చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ ఆరేళ్లపాటు పనిచేశారు. పదోన్నతిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా సూర్యాపేట వెళ్లారు. అక్కడ ఆరు నెలలపాటు సేవలందించి పదవీ విరమణ పొందారు. నాటి నుంచి సొంత ఆసుపత్రిలోనే ఆయన పూర్తిస్థాయిలో వైద్య సేవలందిస్తున్నారు.

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణాలు

బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో సూర్యాపేట జిల్లా కోదాడకు శనివారం ఉదయం 7గంటలకు రాంప్రసాద్ తన కారులో స్నేహితుడితో వెళ్లారు. సాయంత్రం సూర్యాపేటలో తన సోదరి ఇంటి వద్ద ఉన్న తన భార్యను తీసుకుని ఇంటికి బయలుదేరారు. మరి కాసేపట్లో ఇంటికి చేరుతారనగా చౌటుప్పల్ సమీపంలో రాంప్రసాద్ స్వల్పంగా గుండెనొప్పి రావడం మొదలైంది. ఈ విషయాన్ని తన భార్య జ్యోతికి చెప్పగా ఆమె సూచన మేరకు డ్రైవర్ వేగంగా కారు నడిపి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తన ఆస్పత్రిలో పని చేసే సిబ్బందికి విషయాన్ని చెప్పి అలర్ట్ చేశారు. ఇంజక్షన్ చేసినా నొప్పి అదుపులోకి రాకపోవడంతో అపాయాన్ని గుర్తించిన సిబ్బంది సీపీఆర్ చేశారు. అయినా ఫలితం లేకపోయింది.

స్వగ్రామంలో అంత్యక్రియలు, పలువురి నివాళి

రాంప్రసాద్ పార్థీవదేహానికి తన స్వగ్రామమైన పీపల్‌పహాడ్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పలువురు రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ అభిమాన డాక్టర్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.